ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



నంద్యాల

జిల్లా వార్తలు 7

గురువారం 15 ఆగస్టు 2024

జిల్లా అభివృద్ధి కమిటీ చైర్‌పర్సన్‌గా ఎంపీ శబరి



నందికొట్కూరు, ఆగస్టు 14: కేంద్ర ప్రభు త్వ గ్రామీణ అభివృద్ధి మంత్రిత్వశాఖ నంద్యాల ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరిని జిల్లా స్థాయి అభివృద్ధి సహకార కమిటీ చైర్‌పర్సన్‌గా నియమించింది. దీంతో నంద్యాల ఎంపీ బైరెడ్డి శబరికి నియోజకవర్గ టీడీపీ నాయకులు శుభాకాంక్షలు తెలిపారు.

హర్ ఘర్ తిరంగాను విజయవంతం చేయండి

● అధికారులను ఆదేశించిన కలెక్టర్ రాజకుమారి

నంద్యాల (కల్చరల్), ఆగస్టు 14: అజాదీ కా అమృత్ మహోత్సవంలో భాగంగా జిల్లాలో హర్ ఘర్ తిరంగా కార్యక్రమాలను విజయవంతంగా నిర్వహించాలని కలెక్టర్ రాజకుమారి అధికారులను ఆదేశించారు. బుధవారం విజయవాడ సీఎస్ క్యాంపు కార్యాలయం నుంచి హర్ ఘర్ తిరంగా కార్యక్రమంపై ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరబ్ కుమార్ ప్రసాద్ అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. కలెక్టర్ క్యాంపు కార్యాలయం నుంచి కలెక్టర్ రాజకుమారి పాల్గొన్నారు. వీడియో కాన్ఫరెన్స్ అనంతరం కలెక్టర్ రాజకుమారి మాట్లాడుతూ స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకొని జిల్లా వ్యాప్తంగా హర్ ఘర్ తిరంగా కార్యక్రమాలు విస్తృతంగా చేపట్టాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. గ్రామ, మండల, నియోజకవర్గ, డివిజనల్ కేంద్రాల్లో ప్రజాప్రతినిధులు, స్వచ్ఛంద సంస్థలు, ఉద్యోగులు, ప్రముఖ వ్యక్తులను సమన్వయం చేసుకొని ర్యాలీలు నిర్వహించాలన్నారు. సంబంధిత ఫొటోలను హర్ ఘర్ తిరంగా సైట్‌లో అప్‌లోడ్ చేయాలని పర్యాటక శాఖ అధికారులను ఆదేశించారు. అన్ని పాఠశాలలు, విద్యాసంస్థల్లో దేశభక్తి గీతాలతో కూడిన సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని డీఈఓను ఆదేశించారు. స్వాతంత్ర్య సమరయోధుల కుటుంబ సభ్యులను అభినందిస్తూ స్వాతంత్ర్య వేడుకలకు ఆహ్వానించాలన్నారు. రిజర్వాయర్లు మైనర్ ఇరిగేషన్ ట్యాంకులలో జెండాలు మోస్తూ తిరంగా కార్యక్రమాలను నిర్వహించాలని ఆదేశించారు. ప్రతి ఇంటిపై జాతీయ జెండా ఎగురవేయాలని ప్రజలకు కలెక్టర్ విజ్ఞప్తి చేశారు. రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరబ్‌కుమార్ ప్రసాద్ మాట్లాడుతూ అజాదీకా అమృత్ మహోత్సవాల్లో భాగంగా ప్రతి ఇంటిపై జాతీయ జెండా ఎగురవేయాలని, ప్రజల్లో దేశభక్తి భావాలను పెంపొందించే విధంగా, జాతీయ జెండా ప్రాముఖ్యతను తెలిపేలా చేయాలన్నారు. హర్ ఘర్ తిరంగా ర్యాలీలలో కలెక్టర్ కీలక భూమిక పోషించాలని సీఎస్ ఆదేశించారు.



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్ రాజకుమారి

శ్రీశైలానికి పెరిగిన ఇన్‌ఫ్లో



శ్రీశైలం, ఆగస్టు 14: శ్రీశైల జలాశయానికి వరద ప్రవాహం కొనసాగుతోంది. బుధవారం సాయంత్రం 6 గంటల సమయానికి జూరాల నుంచి 32,871 క్యూసెక్కులు, సుంకేసుల నుంచి 1,06,925 క్యూసెక్కులు మొత్తం 1,39,796 క్యూసెక్కుల వరద ప్రవాహం వస్తోంది. శ్రీశైలం జలాశయం పూర్తి స్థాయి నీటి మట్టం 885 అడుగులు కాగా ప్రస్తుత నీటిమట్టం 880.80 అడుగులుగా నమోదయింది. జలాశయం పూర్తి స్థాయి నీటి నిల్వ 215.807 టీఎంసీలు కాగా ప్రస్తుత నీటి నిల్వ 192.5300 టీఎంసీలుగా నమోదైంది. ఆంధ్రప్రదేశ్ జల విద్యుత్ కేంద్రం ద్వారా 30,913 క్యూసెక్కులు, తెలంగాణ జల విద్యుత్ కేంద్రం ద్వారా 37,540 క్యూసెక్కుల మొత్తం 68,453 క్యూసెక్కుల నీటిని విద్యుత్ ఉత్పత్తి చేస్తూ దిగువ నాగార్జున సాగర్ ప్రాజెక్టుకు విడుదల చేస్తున్నారు.

అబ్దుల్లాపురంలో విషాదం



ఉమామహేశ్వరరెడ్డి, ప్రశాంతి (ఫైల్)

పంట పొలంలో విగత జీవులుగా పడి ఉన్న దంపతులు

అప్పుల బాధ తాళలేక దంపతుల బలవన్మరణం

వెలుగోడు, ఆగస్టు 14: ఆ దంపతులు ఒకప్పుడు బాగా బతికారు. సుమారు ఎనిమిదిన్నర ఎకరాల సొంత భూమిలో పంటలు పండించుకుంటూ జీవనం కొనసాగించారు. తమకున్న ఏకైక కుమారుడిని గారాబంగా పెంచి బాగా చదివించుకోవాలన్నారు. చదువు కోసం కుమారుడు అడిగినంత డబ్బు ఇస్తూ వచ్చారు. చివరకు కుమారుడు ఉద్యోగం కోసమంటూ అడిగినంత డబ్బు ఇచ్చారు. ఇలా రూ.2.40 కోట్ల దాకా అప్పులు చేశారు. చేసిన అప్పు తీర్చలేక.. రుణదాతల ఒత్తిళ్లు తట్టుకోలేక బుధవారం ఆత్మహత్య చేసుకున్నారు. వెలుగోడు మండలంలోని అబ్దుల్లాపురం గ్రామంలో ఉమామహేశ్వర రెడ్డి(45), ఆయన భార్య ప్రశాంతి(40) ఆత్మహత్య చేసుకున్న ఘటన సంచలనం రేకెత్తించింది. అబ్దుల్లాపురం గ్రామానికి చెందిన ఉమామహేశ్వర రెడ్డి, ఆయన భార్య ప్రశాంతి అబ్దుల్లాపురంలో నివాసం ఉంటున్నారు. వారికి ఎనిమిదిన్నర ఎకరాల పొలం ఉంది. వారి ఏకైక కుమారుడు నితిన్ కుమార్‌రెడ్డి చదువు కోసం, అనంతరం ఉద్యోగం కోసం రూ2.40 కోట్ల దాకా అప్పులు చేశారు. అప్పులు సకాలంలో కట్టకపోవడంతో రుణదాతల నుంచి ఒత్తిళ్లు అధికం అయ్యాయి. దీంతో వారు కొద్దిరోజులు గ్రామం వదిలి వెళ్లిపోయారు. తమ పరువు ప్రతిష్టలకు భంగం కలుగకుండా గ్రామంలోని 5 ఎకరాల పొలంతో పాటు ఇంటిని విక్రయించి రూ.1.20 కోట్ల అప్పులు తీర్చి గ్రామానికి చేరుకున్నారు. ఉన్న ఇంటిని అమ్ముకోవడంతో వెలుగోడుకు చేరుకున్నారు. అయినప్పటికి రుణదాతల నుంచి ఒత్తిళ్లు అధికం కావడంతో మిగిలిన మూడున్నర ఎకరాల భూమిని అమ్మకానికి పెట్టారు. ఈ సమయంలో బుధవారం తెల్లవారుజామున సొంతపొలానికి వెళ్లిన దంపతులు పంటలకు వినియోగించే క్రిమి సంహారక మందుతాగి ఆత్మహత్య చేసుకున్నారు. ఆత్మకూరు డీఎస్పీ రామాంజినాయక్, వెలుగోడు ఎస్ఐ భూపాలుడు ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. మృతురాలి తండ్రి వెంకటేశ్వరరెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నారు. పోస్టుమార్టం నిమిత్తం అనంతరం మృతదేహాలను వారి బంధువులకు అప్పగించారు. ఇదిలా ఉండగా అప్పులు ఇచ్చిన వాళ్ల నుంచి ఒత్తిళ్లతో పాటు ఇటీవలి కాలంలో వారు ఎదుర్కొన్న ఆర్థిక సమస్యలపై ఓ ఉత్తరాన్ని రాసి బంధువులకు వాట్సప్ ద్వారా సమాచారం ఇచ్చారు.

స్వాతంత్ర్య వేడుకల రిహార్సల్స్

నంద్యాల క్రైం, ఆగస్టు 14 : స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను పురస్కరించుకొని ఎస్పీ అధిరాజ్ సింగ్ రాణా ఆధ్వర్యంలో బుధవారం పోలీస్ కవాతు రిహార్సల్స్ నిర్వ హించారు. ఎస్పీ కళాశాల మైదానానికి రాగానే ముందుగా జాతీయ జెండాను ఎగుర వేశారు. అనంతరం పోలీస్ పరేడ్ రిహార్సల్స్‌లో భాగంగా ఎస్పీ పరేడ్ కమాండర్ రిజర్వ్ ఇన్‌స్పెక్టర్ మంజునాథ్ నుంచి గౌరవ వందనం స్వీకరించారు. అనంతరం కవాతు పరిశీలన వాహనంలో ఎస్పీ ఆర్మ్‌డ్ రిజర్వ్ బలగాలు, సివిల్ పోలీసులు, హోం గార్డ్స్‌తోపాటు ఎన్‌సీసీ, స్కౌట్స్ అండ్ గైడ్స్ విద్యార్థుల ను పరిశీలించారు. పోలీస్ కవాతు రిహార్సల్స్‌ను పరిశీలిస్తూ వివిధ విభాగాల గౌరవ వందనం స్వీకరించారు. స్వాతంత్ర్య వేడుకలకు రానున్న ప్రముఖులు, స్వాతంత్ర్య సమర యోధుల కుటుం బాలు, ఉన్నతాధికారులు, ప్రజల గ్యాలరీ ఏర్పాట్లు, కల్పించాల్సిన భద్రత తదితర సౌకర్యాలపై పోలీస్ అధికారులకు పలు సూచనలు చేశారు. కార్య క్రమంలో ఎస్పీతో పాటు ఇన్‌స్పెక్టర్లు నరసింహులు, మంజునాథ్, శ్రీనివాసులు, ఆర్ఎస్సైలు పాల్గొన్నారు.



సప్త రాత్రోత్సవాలను విజయవంతం చేయండి

● 20న పూర్వారాధన, 21న మధ్యారాధన, 22న రథోత్సవం : పీఠాధిపతి

మంత్రాలయం, ఆగస్టు 14: మంత్రాలయం రాఘవేంద్రస్వామి 353 సప్తరాత్రోత్సవాలను విజయవంతం చేయాలని మఠం పీఠాధిపతి సుబుధేంద్ర తీర్థులు అన్నారు. బుధవారం స్వామీజీ గదిలో ఉత్సవాలపై విలేకర్ల సమావేశం ఏర్పాటుచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉత్సవాలు ఈనెల 18 నుంచి 24 వరకు ఘనంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 20న పూర్వారాధన, 21న మధ్యారాధన, 22న ఉత్తరాధనరోజు మహా రథోత్సవం కన్నుల పండుగగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సాయంత్రం యోగీంద్ర కళామంటపంలో దాసవాణి సాహిత్యం, కూచిపూడి నృత్యం, భరతనాట్యం, వీణా వాయిద్యం, పౌరాణిక నాటకాలు భక్తులను అలరిస్తాయని తెలిపారు. దాదాపు 5 లక్షల మంది భక్తులు పాల్గొంటారని, వారికి శ్రీమఠంలోని అన్ని శాఖల అధికారులు, ప్రభుత్వ అధికారుల సహకారంతో ఏర్పాట్లు పూర్తి చేసినట్లు తెలిపారు.

● మంత్రాలయంలో భక్తులకు తాగునీటి సమస్య లేకుండా శాశ్వతంగా రాఘవేంద్ర జల ప్రసాదం పేరుతో భారీ మినరల్ వాటర్ ప్లాంట్లు ఏర్పాటు చేస్తున్నట్లు పీఠాధిపతి తెలిపారు. అన్నపూర్ణ భోజన శాల, బృందావన గార్డన్ గెస్ట్‌హౌస్, విజయేంద్ర వసతి గృహం (వీవీజీ 100 గదుల సముదాయం) దగ్గర ఏర్పాటు చేస్తామన్నారు. 353 ఉత్సవాల్లో రూ.3.16 కోట్లతో బెంగుళూరుకు చెందిన అశ్వత్థామ అనే భక్తుడు నిర్మించిన గురునివాస్ భవనం, రూ.80 లక్షల ఖర్చుతో ఎంటీఆర్ లైన్ మధ్వమార్గ్ కారిడార్ విస్తరణ, రాఘవేంద్రస్వామి గర్భగుడి శిలామంటపం పైభాగాన బంగారు పూత అలంకరణ(తూర్పువైపు), రూ.15 లక్షలు ఖర్చుతో బంగారు పూతతో రాఘవేంద్ర సర్కిల్ ఆధునికీకరణ వంటి పనులు పూర్తి చేశారు.



విలేకరులతో మాట్లాడుతున్న పీఠాధిపతి

● ఉత్సవాల్లో రెండో రోజు కర్నాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్య మంత్రాలయం వస్తున్నట్లు పీఠాధిపతి తెలిపారు. ఇన్ఫోసిస్ అధినేత్రి సుధానారాయణ మూర్తి, కేంద్ర మంత్రులు కుమారస్వామి దేవెగౌడ, శోభకరంధాట్లే, మైసూర్ మహారాజు యదువీర్‌కృష్ణదత్త చామరాజేంద్ర వడియార్, రాష్ట్ర మంత్రులు పాల్గొంటున్నట్లు తెలిపారు.

అవినీతి అధికారి బదిలీ..!

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

నంద్యాల, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో అవినీతికి పాల్పడిన మహిళా అధికారిని జిల్లా యంత్రాంగం బుధవారం బదిలీ చేసినట్లు తెలిసింది. ఈ నెల 12న 'ఎన్నికల్లో అధికారి అవినీతి' అంటూ ఆంధ్రజ్యోతి కథనాన్ని ప్రచురించింది. దీనికి స్పందించిన జిల్లా యంత్రాంగం చర్యలు తీసుకున్నట్లు తెలుస్తోంది. ఆ అధికారిని ఒక్కరినే బదిలీ చేస్తే లేనిపోని అనుమానాలు వస్తాయని భావించి, ఇతర అధికారుల బదిలీ చేసే క్రమంలో సదరు అధికారిని కూడా జిల్లాలోని వేరే ప్రాంతానికి బదిలీ చేసినట్లు సమాచారం.

ప్రభుత్వ కళాశాల మైదానంలో
నేడు స్వాతంత్ర్య వేడుకలు

● ఏర్పాట్లు పూర్తి చేసిన అధికారులు

నంద్యాల (కల్చరల్), ఆగస్టు 14: 78వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలకు జిల్లా ముస్తాబైంది. ఈ సందర్భంగా వివిధ ప్రభుత్వ శాఖలు, ప్రభుత్వేతర సంస్థల్లో వేడుకలను ఘనంగా నిర్వహించుకునేందుకు ఏర్పాట్లు పూర్తి చేశారు. త్రివర్ణ పతాకాన్ని ఎగురవేసేందుకు సిద్ధం చేసుకున్నారు. జిల్లా కేంద్రమైన నంద్యాలలో స్వాతంత్ర్య వేడుకల శోభ సంతరించుకుంది. గురువారం ఉదయం 8.30 గంటలకు హాజరై 9 గంటలకు రాష్ట్ర మౌలిక సదుపాయాలు, పెట్టుబడులు శాఖ మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై జాతీయ జెండాను ఆవిష్కరిస్తారు. అనంతరం పోలీసు సాయుధ దళాల గౌరవ వందనం స్వీకరించి, ఓపెన్‌టాప్ వాహనంలో పరేడ్‌ను పరిశీలిస్తారు. సాయుధ దళాల మార్చ్‌ఫాస్ట్ అనంతరం ప్రజలనుద్దేశించి ప్రసంగిస్తారు. అనంతరం జిల్లాలో జరిగిన అభివృద్ధి కార్యక్రమాలపై వివిధ ప్రభుత్వ శాఖల శకటాల ప్రదర్శన ఉంటుంది. స్వాతంత్ర్య వేడుకల్లో బాలబాలికల సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేస్తున్నారు. జిల్లా కలెక్టర్‌తోపాటు జాయింట్ కలెక్టర్ విష్ణుచరణ్, జిల్లా ఎస్పీ అధిరాజ్‌సింగ్‌రాణా, డీఆర్వో పద్మజ, ఆర్డీఓ మల్లికార్జునరెడ్డి, సంబంధిత అధికారులు చేస్తున్న ఏర్పాట్లను కలెక్టర్‌కు వివరించారు.



చంద్రన్న బీమా-ఎన్టీఆర్ భరోసా పింఛన్ స్టాల్



ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్న కలెక్టర్, జేసీ ఇతర అధికారులు

ఎస్‌ఐ బాధ్యతల స్వీకరణ

పాములపాడు, ఆగస్టు 14: పాములపాడు మండలం ఎస్‌ఐగా సురేశ్ కుమార్ బుధవారం బాధ్యతలు చేపట్టారు. సత్యసాయి జిల్లా బుక్కపట్నం నుంచి బదిలీపై వచ్చారు. పాములపాడులో విధులు నిర్వహిస్తున్న ఎస్‌ఐ అశోక్ బదిలీపై వెల్దుర్తికి వెళ్లారు. సిబ్బంది కొత్తగా బాధ్యతలు చేపట్టిన ఎస్‌ఐకి సిబ్బంది పుష్పగుచ్ఛం అందించి స్వాగతం పలికారు. బదిలీపై వెళ్లిన ఎస్‌ఐ అశోక్‌కు పూలమాలలు వేసి శాలువాలతో సన్మానించి వీడ్కోలు పలికారు.

ఎంపీ శబరి ఎంపికపై హర్షం

కొత్తపల్లి, ఆగస్టు 14: కేంద్ర గ్రామీణాభివృద్ధి మంత్రిత్వ శాఖ నంద్యాల పార్లమెంటు సభ్యురాలు, లోక్‌సభ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ డాక్టర్ బైరెడ్డి శబరిని నంద్యాల జిల్లా స్థాయి అభివృద్ధి సహకార పర్యవేక్షణ కమిటీ చైర్‌పర్సన్‌గా నియమించడం పట్ల కొత్తపల్లి మండల టీడీపీ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. మండలంలోని వీరాపురం, లింగాపురం, గుమ్మడాపురం నందికుంట గ్రామాలకు చెందిన టీడీపీ నాయకులు కర్నాటి శివారెడ్డి, నాగేశన్న, చిన్నపుల్లారెడ్డి, మధుసూదన్ రెడ్డి బుధవారం హర్షం వ్యక్తం చేశారు. ఎంపీ జిల్లాను అభివృద్ధి బాటలో తీసుకెళ్లడంలో శాయశక్తులా కృషి చేస్తారని వారు ఆశాభావం వ్యక్తం చేశారు.

ప్రతి ఇంటిపై జెండా ఎగరాలి

- ప్రముఖుల పిలుపు
- ఘనంగా 'హర్ ఘర్ తిరంగా'
- జాతీయ పతాకంతో ర్యాలీ



నంద్యాలలో జాతీయ జెండాతో ర్యాలీ చేస్తున్న నాయకులు



ఆత్మకూరులో..



వెలుగోడులో.

ప్రతి ఇంటిపై జాతీయ జెండా ఎగురవేయాలని ప్రముఖులు పిలుపునిచ్చారు. 'హర్ ఘర్ తిరంగా' యాత్రలో భాగంగా జాతీయ పతాకంతో ర్యాలీ, బైకు ర్యాలీ నిర్వహించారు. ప్రముఖులు మాట్లాడుతూ స్వాతంత్ర్య సమరయోధులను ఎప్పటికీ మరవకూడదని వారు చేసిన త్యాగాన్ని కొనియాడారు.

నంద్యాల (కల్చరల్), ఆగస్టు 14: నంద్యాల పట్టణంలో బీజేపీ ఆధ్వర్యంలో 'హర్ ఘర్ తిరంగా' యాత్రలో భాగంగా 300 అడుగుల జాతీయ జెండాతో ప్రదర్శన నిర్వహించారు. బీజేపీ జిల్లా కోఆర్డినేటర్ అభిరుచి మధు ఆధ్వర్యంలో పట్టణంలో జాతీయ జెండాతో ర్యాలీ నిర్వహించారు. బీజేపీ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పాల్గొన్నారు.

నందికొట్కూరు: శ్రీనవనంది హైస్కూల్ ఆధ్వర్యంలో పట్టణంలో హర్ ఘర్ తిరంగా ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ఎంఈవో ఫైజున్నీసా బేగం హాజరయ్యారు. కార్యక్రమంలో పాఠశాల చైర్మన్ శ్రీధర్, హెచ్‌ఎం నరసప్ప, పాఠశాల కో-ఆర్డినేటర్ మౌలాలి జిన్నా, విశ్రాంత వ్యాయామ ఉపాధ్యాయుడు శివశంకర్‌రెడ్డి, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

ఆత్మకూరు: స్వాతంత్ర్య స్ఫూర్తిని ప్రతి ఒక్కరూ అలవర్చుకోవాలని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ జిష్ణు నాగ్ విజయ్ సూచించారు. ఈ మేరకు బుధవారం స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను పురస్కరించుకుని జాతీయ జెండాలను చేతబూని విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. అదేవిధంగా విద్యార్థులకు వివిధ పోటీలను నిర్వహించారు. కళాశాల వైస్ ప్రిన్సిపాల్ పద్మావతీబాయి, అధ్యాపకులు కృష్ణ, విద్యాసాగర్, రామకృష్ణారెడ్డి ఉన్నారు.

● భారత స్వతంత్ర్య వేడుకలను పురస్కరించుకుని ప్రతి ఒక్కరూ జాతీయ సమైక్యతను చాటుకోవాలని బీజేపీ మైనార్టీ మహిళా మోర్చా జాతీయ నాయకురాలు, శ్రీశైలం నియోజకవర్గం బీజేపీ కన్వీనర్ మోమిన్ షబాన సూచించారు. బుధవారం ఆమె పట్టణంలో పలు ప్రభుత్వ శాఖల అధికారులకు జాతీయ పతాకాలను పంపిణీ చేశారు. అదేవిధంగా పలు చెంచుగూడేలకు జాతీయ జెండాలను ఎగురవేసి భారత స్వాతంత్ర్య దినోత్సవ ప్రాముఖ్యతను వివరించారు.

వెలుగోడు: వెలుగోడు పట్టణంలో ఎన్డీఏ కూటమి నాయకులు పంద్రాగస్టును పురస్కరించుకుని బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీని టీడీపీ మండల అధ్యక్షుడు అన్నారపు శేషి రెడ్డి ప్రారంభించారు. ఈ ర్యాలీ పుర వీధుల గుండా నిర్వహించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు జాకీర్ ఖలీల్, బీజేపీ నాయకులు రాజశేఖరరెడ్డి, నూలు నాగేశ్వరరావు, పురుషోత్తంగౌడ్, ప్రతాప్ ఆచారి, మధుగౌడ్, జనసేన నాయకులు పాలు బాషా, తిరుపాల్ నాయక్ తదిరతులు పాల్గొన్నారు.

గడివేముల: ప్రతి ఇంటిపై జాతీయ జెండాను ఎగురవేయాలని టీడీపీ మండల అధ్యక్షుడు దేశం సత్యనారాయణరెడ్డి, బీజేపీ మండల అధ్యక్షుడు శ్రీనివాసరెడ్డి అన్నారు. మండల కేంద్రంలో బుధవారం జిల్లా పరిషత్ హైస్కూల్ నుంచి గడివేముల పాతబస్టాండు వరకు హర్ ఘర్ తిరంగా నినాదంతో బైక్ ర్యాలీ నిర్వహించారు. వారు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ తమ ఇంటిపై జాతీయ జెండాను ప్రదర్శించి జాతీయ ఐక్యతను చాటాలని అన్నారు. టీడీపీ నాయకులు జమాల్‌బాషా, మాజీ సర్పంచ్ జమాల్‌బాషా, బీజేపీ నాయకులు రమణ, జనసేన నాయకులు సాయి పాల్గొన్నారు.



నందికొట్కూరులో..



గడివేములలో..

యువతి చికిత్సకు రూ.3 లక్షలు

● పీఎం రిలీఫ్ ఫండ్ నుంచి మంజూరు చేయించిన ఎంపీ

గడివేముల, ఆగస్టు 14: అనారోగ్యంతో బాధపడుతూ ఇబ్బందులు పడుతున్న బాధితురాలికి నంద్యాల ఎంపీ, లోక్‌సభ టీడీపీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ డాక్టర్ బైరెడ్డి శబరి అండగా నిలిచారు. కరిమద్దెల గ్రామానికి చెందిన యువతి గాయత్రి అనారోగ్య సమస్యలతో బాధపడుతున్నారు. తమిళనాడు రాష్ట్రంలోని వేలూరు క్రిష్టియన్ మెడికల్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. తండ్రి మరణించడంతో ఆర్థిక సమస్యలతో తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. ఆర్థిక పరిస్థితులు సరిగా లేకపోవడంతో మధ్యలోనే చికిత్సను నిలిపివేశారు. గాయత్రి పరిస్థితిని నంద్యాల ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరికి బాధితురాలి కుటుంబ సభ్యులు తీసుకెళ్లగా స్పందించి ప్రధాన మంత్రి సహాయ నిధి నుంచి రూ.3 లక్షలు మంజూరు చేయించారు. బాధితురాలికి ఎంపీ అండగా నిలవడంతో కుటుంబ సభ్యులు, గ్రామస్థులు కృతజ్ఞతలు తెలిపారు.

'కార్మికుల సమస్యలు పరిష్కరించాలి'

నందికొట్కూరు, ఆగస్టు 14: మున్సిపల్ దినసరి కార్మికుల సమస్యలను పరిష్కరించాలని మున్సిపల్ డైలీ వేజ్ కార్మిక సంఘం ఐఎఫ్‌టీయూ ఆధ్వర్యంలో కార్మికులు కమిషనర్ సుధాకర్‌రెడ్డికి వినతిపత్రం సమర్పించారు. సీపీఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ జిల్లా కార్యదర్శి నరసింహులు, అఖిలభారత రైతు కూలీ సంఘం జిల్లా కార్యదర్శి గోపాల్, జిల్లా నాయకులు ఎల్లనాయుడు, డైలీ వేజ్ కార్మికులు పాల్గొన్నారు.

వడదెబ్బతో వ్యవసాయ కూలీ మృతి

పాణ్యం, ఆగస్టు 14: మండలంలోని ఆలమూరులో వ్యవసాయ కూలీ నరసింహులు మృతి చెందాడు. నరసింహులు వ్యవసాయ కూలీగా జీవిస్తున్నాడు. బుధవారం ఆయన పనికి వెళ్లి ఇంటికి తిరిగి వచ్చాక కుప్పకూలి మరణించాడు. ఆయన మృతితో కుటుంబం పెద్ద దిక్కు కోల్పోయింది. ఈయనకు భార్య, కుమారుడు ఉన్నారు. ప్రభుత్వం మృతుని కుటుంబాన్ని ఆదుకోవాలని టీడీపీ నాయకుడు చంద్రశేఖరరెడ్డి కోరారు.

ఆటో బోల్తా.. ముగ్గురికి గాయాలు

పాణ్యం, ఆగస్టు 14: మండలంలోని రాజస్థాన్ డాబా వద్ద బుధవారం ఆటో బోల్తా పడి ముగ్గురు రైతులకు గాయాలైనట్లు హైవే పెట్రోల్ సిబ్బంది తెలిపారు. రుద్రవరం మండలం మహాదేవపురం నుంచి తెలంగాణ గద్వాలకు ఆటోలో వెళ్తుండగా అదుపు తప్పి బోల్తా పడడంతో ఆటోలో ప్రయాణిస్తున్న రైతులకు గాయాలైనట్లు తెలిపారు. సీడ్ పత్తి క్రాసింగ్‌కు వెళ్తుండగా ఈ సంఘటన జరిగినట్లు తెలిపారు. గాయపడిన వారిని నంద్యాల ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఫిర్యాదు అనంతరం కేసు నమోదు చేస్తామని పాణ్యం పోలీసులు తెలిపారు.

విద్యార్థులకు క్విజ్ పోటీలు

గోస్పాడు, ఆగస్టు 14: స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా జిల్లెల్ల ప్రభుత్వ పాఠశాలలోని విద్యార్థులకు ఏపీజీబీ ఆధ్వర్యంలో క్విజ్ పోటీలను నిర్వహించారు. బ్యాంక్ మేనేజర్ సాయి సాత్విక బహుమతులు అందజేశారు. స్వాతంత్ర్య సమరయోధుల గురించి విద్యార్థులకు వివరించారు. హెచ్‌ఎం రామచంద్రారెడ్డి, అసిస్టెంట్ మేనేజర్ రంజీత్, నాగన్న పాల్గొన్నారు.

'మండల అభివృద్ధికి కృషి'

గడివేముల, ఆగస్టు 14: మండల అభివృద్ధికి కృషి చేస్తామని టీడీపీ మండల అధ్యక్షుడు సత్యనారాయణరెడ్డి అన్నారు. మండల కేంద్రంలోని బీసీ కాలనీలో బుధవారం సర్పంచ్ రవణమ్మ ఆధ్వర్యంలో ప్రజా సమస్యల పరిష్కార వేదికను నిర్వహించారు. పలు సమస్యలను ప్రజలు నాయకుల దృష్టికి తెచ్చారు. సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామని సత్యనారాయణరెడ్డి హామీ ఇచ్చారు. మాజీ సర్పంచ్‌లు రామచంద్రారెడ్డి, రిటైర్డ్ ఆర్మీ జమాల్‌బాషా పాల్గొన్నారు.

వాహనాలు సీజ్

నందికొట్కూరు రూరల్, ఆగస్టు 14: బ్రాహ్మణకొట్కూరు పరిధిలో హంద్రీ నీవా సుజల స్రవంతి కాలువ సమీపంలో అక్రమంగా ఎర్రమట్టి తవ్వకాలు జరుపుతూ ట్రాక్టర్ల ద్వారా ఎర్రమట్టిని తరలిస్తుండగా ఒక ఎక్స్‌కవేటర్, నాలుగు ట్రాక్టర్లను సీజ్ పోలీసులు చేశారు. బ్రాహ్మణకొట్కూరు ఏఎస్‌ఐ రఘురామయ్య తెలిపిన వివరాలివి.. బ్రాహ్మణకొట్కూరు సమీపంలో గల హంద్రీ నీవా సృజల స్రవంతి కాలువ సమీపంలో ఎటువంటి అనుమతులు లేకుండగా అక్రమంగా ఎక్స్‌కవేటర్‌తో ఎర్రమట్టి త్వకాలు జరుపుతూ నాలుగు ట్రాక్టర్లద్వారా తరలిస్తుండగా బ్రాహ్మణకొట్కూరు వీఆర్వో హనుమంతు, లస్కర్లు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఆకస్మికంగా దాడులు నిర్వహించారు. అక్కడ మట్టిని తరలిస్తున్న వాహనాలను స్టేషన్‌కు తరలించి సీజ్ చేసి కేసు నమోదు చేశారు. ఈ వాహనాలు గార్గేయపురం గ్రామానికి చెందిన వారివి అని తెలిపారు. కేసు దర్యాప్తు చేస్తున్నామని ఏఎస్‌ఐ తెలిపారు

'విద్యారంగ సమస్యలు పరిష్కరించాలి'



మంత్రికి వినతిపత్రం అందజేస్తున్న ఏపీటీఎఫ్ నాయకులు

నంద్యాల (నూనెపల్లె), ఆగస్టు 14: విద్యారంగ సమస్యలను పరిష్కరించాలని ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు రామచంద్రారెడ్డి, శివయ్య డిమాండ్ చేశారు. మంత్రి ఎన్‌ఎండీ ఫరూక్‌ను ఆయన కార్యాలయంలో బుధవారం ఏపీటీఎఫ్ నాయకులు కలసి వినతి పత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ.. పాఠశాలల ఉనికికే ప్రశ్నార్థకంగా ఉన్న జీవోలు 117, 128, లను రద్దు చేయాలని కోరారు. సబ్జెక్ట్ టీచర్ల కొరతను అధిగమించడానికి పని సర్దుబాటు ద్వారా కాకుండా వెంటనే నెలవారి పదోన్నతులు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. ఇంగ్లీష్ మీడియంతో పాటు తెలుగు, ఉర్దూ మీడియంలను కొనసాగించాలని, సీబీఎస్‌ఈ బోర్డుకు అనుసంధానం చేసిన పాఠశాలలను తిరిగి వెనుకకు తీసుకుని ఎన్సిఈఆర్టీ సిలబస్ స్థానంలో స్టేట్ సిలబస్‌ను ప్రవేశ పెట్టాలని కోరారు. కార్యక్రమంలో భాస్కరరెడ్డి, రాజ్‌కుమార్, దస్తగిరి, వీరేశ్వరరెడ్డి, రంగనాయకులు, తదిరతులు పాల్గొన్నారు.

'టీడీపీతోనే అభివృద్ధి'



డ్రైనేజీ పనులను పరిశీలిస్తున్న ఎన్‌ఎండీ ఫిరోజ్

నంద్యాల (నూనెపల్లె), ఆగస్టు 14: టీడీపీతోనే సమగ్రాభివృద్ధి సాధ్యమని టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్‌ఎండీ ఫిరోజ్ అన్నారు. 38వ వార్డు వైఎస్‌ఆర్ నగర్‌లో ప్రారంభమైన డ్రైనేజీ పనులను ఫిరోజ్ బుధవారం పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ నియోజకవర్గ ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేరుస్తామన్నారు. నంద్యాల మున్సిపల్ కౌన్సిల్ సమావేశంలో అభివృద్ధి పనులకు బిల్లులు ఆపకుండా ఆమోదం తెలపాలని, అభివృద్ధికి కౌన్సిల్ సభ్యులు సహకరించాలని కోరారు. దేరెడ్డి శివనాగిరెడ్డి, తాటికొండ బుగ్గరాముడు, మరాఠి సూరి, ప్రసాదరెడ్డి, నాగరాజు, మహేష్ పాల్గొన్నారు.

పంటల పరిశీలన



కొక్కెరంచలో పంటను పరిశీలిస్తున్న వ్యవసాయాధికారులు

కొత్తపల్లి, ఆగస్టు 14: మండలంలోని ఎదురుపాడు, కొక్కెరంచలో రైతు సేవా కేంద్రాలను, పంటలను వ్యవసాయ సహాయ సంచాలకుడు బి.ఆంజనేయ బుధవారం పరిశీలించారు. వ్యవసాయాధికారి మాట్లాడుతూ ఈ సీజన్‌లో పంటలు వేసిన ప్రతి రైతును ఈ పంట నమోదు తప్పకుండా చేయాలని, అదే విధంగా త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. ఏవో కె.మహేష్, రైతు సేవా కేంద్ర సిబ్బంది అశోక్, షఫీ, రైతులు పాల్గొన్నారు.

మల్లన్నకు పసిడి నాగాభరణం



బంగారు నాగాభరణం అందజేస్తున్న భక్తుడు

శ్రీశైలం, ఆగస్టు 14: శ్రీశైలం మల్లికార్జున స్వామికి ఒడిశా రాష్ట్రం, రాయఘడ్ జిల్లా గుణుపూరుకు చెందిన జి. గోపాలరావు అనే భక్తుడు ఎర్రరాళ్లు పొదిగిన బంగారు నాగాభరణాన్ని సమర్పించారు. అమ్మవారి ఆలయ ప్రాంగణంలోని ఆశీర్వచన మండపంలో దాతలు ఆలయ ప్రధానార్చకులు ఉమానాగేశ్వరశాస్త్రి, పర్యవేక్షకుడు అయ్యన్న, ఆలయం ఇన్‌స్పెక్టర్ మల్లికార్జునకు 45గ్రాములు బరువైన ఆభరణాన్ని అందజేశారు. అధికారులు దాతకు స్వామి, అమ్మవార్ల శేషవస్త్రాలు, ప్రసాదాలు అందజేసి సత్కరించారు.

ఘనంగా ద్విశతావధానం



ద్విశతావధానంలో పాల్గొన్న కవులు, పండితులు

శ్రీశైలం, ఆగస్టు 14: శ్రీశైలం మహాక్షేత్రంలో శ్రావణమాసోత్సవాల సందర్భంగా ద్విశతావధానం కార్యక్రమాన్ని దేవస్థానం బుధవారం ప్రారంభించింది. ఆలయ మాఢవీధిలోని నిత్యకళారాధన వేదికపై "అవధాన కవితా నీరాజనం" పేరుతో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమం ఐదు రోజుల పాటు నిర్వహించనున్నారు. ప్రతి రోజు ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు, తిరిగి మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 6 గంటల వరకు నిర్వహించనున్నారు. కార్యక్రమంలో రెండు తెలుగు రాష్ట్రాలలోని వివిధ ప్రాంతాలకు చెందిన ప్రసిద్ధులైన 60 మంది కవిపండితులు పృచ్ఛకులుగా పాల్గొంటున్నారు. పశ్చిమ గోదావరి జిల్లా భీమడోలుకు చెందిన అపర్ణ అవధానిగా వ్యవహరించారు. ఈవో పెద్దిరాజు మాట్లాడుతూ ప్రాచీన కాలం నుంచి సంగీతం, సాహిత్యం, నృత్యం, శిల్పం, చిత్రలేఖనం తదితర కళలకు ఆలయాలే వేదికలుగా నిలిచాయన్నారు. భక్తి సాహిత్య కార్యక్రమాల నిర్వహణలో భాగంగా నిర్వహిస్తున్న ఈ ద్విశతావధాన కార్యక్రమంలో కవిపండితులు, అవధానులు, రచయితలు పాల్గొనడం ఎంతో ఆనందాన్ని కలిగిస్తుందని పేర్కొన్నారు.

వర్షం కోసం ప్రత్యేక పూజలు



లింగమయ్యస్వామికి పూజలు చేస్తున్న ప్రజలు

గడివేముల, ఆగస్టు 14: వర్షం కురిసి పంటలు బాగా పండాలని మండల కేంద్రంలో కురువ సామాజిక వర్గం ఆధ్వర్యంలో బుధవారం లింగమయ్య స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. బీరప్పస్వామి ఆలయం నుంచి మంగళవాయిద్యాలతో 9 రోజుల పాటు నీటి బిందెలను తీసుకెళ్లి లింగమయ్యకు జలాభిషేకం నిర్వహించారు. చివరి రోజు లింగమయ్యకు డప్పులతో, మంగళ వాయిద్యాల మధ్య పూజలు నిర్వహించారు. భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు.

ముగిసిన శిక్షణ

పాణ్యం, ఆగస్టు 14: మూడు రోజులుగా సర్పంచ్‌లకు, పంచాయతీ కార్యదర్శులకు నిర్వహిస్తున్న రీఫ్రెష్ శిక్షణా కార్యక్రమం బుధవారం ముగిసింది. గ్రామాలలో పారిశుధ్యంపై పంచాయతీ సిబ్బంది, అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని ఎంపీడీవో దస్తగిరి సూచించారు. ఆయనమ మాట్లాడుతూ గ్రామాలలో మురుగు కాల్వల శుభ్రత, చెత్త తొలగింపు, దోమల నివారణ, చెత్త సంపద కేంద్రాల నిర్వహణ, పంచాయతీ అభివృద్ధి పథంలో నడవడానికి ప్రణాళికలు వంటి కార్యక్రమాలపై ఆయన సూచనలందించారు. ఈవోఆర్డీ సులోచన, పాణ్యం పంచాయతీ కార్యదర్శి ఆనందరావు, సర్పంచ్‌లు, వివిధగ్రామాల సర్పంచ్‌లు, కార్యదర్శులు, రీసోర్స్ పర్సన్‌లు పాల్గొన్నారు.

పగిడ్యాల: గ్రామ పంచాయతీల అభివృద్ధి పరుచేందుకు తీసుకోవల్సిన అంశాల పై పగిడ్యాల ఎంపీడీవో కార్యాలయంలో సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులకు నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో బుధవారంతో ముగిసినట్లు ఎంపీడీవో వెంకటరమణ తెలిపారు. కార్యక్రమంలో ఈవోఆర్డి నాగేంద్రమయ్య, సర్పంచులు, కార్యదర్శులు పాల్గొన్నారు.

మహానంది: గ్రామాల అభివృద్ధితో పాటు పరిశుభ్రత కోసం ప్రభుత్వం ఏర్పాటు చేసిన సర్పంచ్‌ల మూడు రోజుల శిక్షణ కార్యక్రమం బుధవారం ముగిసింది. ఈ సందర్భంగా మండల కేంద్రమైన ఎం. తిమ్మాపురంలోని ప్రభుత్వ ఆదర్శ పాఠశాలలో ఎంపీడీవో శ్రీనివాసులరెడ్డి ఆధ్వర్యంలో సర్పంచ్‌లకు, పంచాయితీ కార్యదర్శులకు సాలిడ్ వేస్టు మేనేజ్‌మెంట్, శానిటేషన్‌తో పాటు వీధి దీపాల నిర్వహణ, చెత్త కేంద్రాల నుంచి సంపద తయారీ, వర్మీ కంపోస్టు తయారీ విధానంపై శిక్షణలో టీఓటీలు కలువ భాస్కర్, వెంకటయ్య, సుమంత్ ఇచ్చారు. మండల ఉపాధిహామీ పథకం అధికారి మనోహర్, ఈవోఆర్డీ శివనాగజ్యోతి పాల్గొన్నారు.


గోస్పాడు: గ్రామ పరిపాలనలో సర్పంచ్‌లదే కీలక పాత్ర అని ఎంపీడీవో నాగ అనసూయ అన్నారు. మూడు రోజుల పాటు సర్పంచ్‌లకు, పంచాయతీ కార్యదర్శులకు జరిగిన శిక్షణా తరగతులు బుధవారం ముగిశాయి. ఈ శిక్షణా తరగతుల్లో గ్రామ అభివృద్ధి ప్రణాళిక తయారీ, పారిశుద్యం, వీధి దీపాలు, రోడ్లు, డ్రైనేజీ వ్యవస్థ, తడిచెత్త, పొడిచెత్త వేరు చేసి సేంద్రీయ ఎరువుల తయారీ విధానంపై అవగాహన కల్పించినట్లు ఎంపీడీవో తెలిపారు. ఈవో సుబ్బారావు, సర్పంచ్‌లు కాటంరెడ్డి సుధామణి, పరదేశి ప్రమీళ, ఐజయ్య, శివరామిరెడ్డి, కోటేశ్వరరెడ్డి, కార్యదర్శులు ప్రసాద్, ధనుంజయరెడ్డి, సుజాత పాల్గొన్నారు.

ఆత్మకూరు: ఆత్మకూరు మండలంలోని ఆయా గ్రామాల సర్పంచ్‌లకు, పంచాయతీ కార్యదర్శులకు గ్రామపంచాయతీల పరిపాలనతో పాటు పంచాయతీ రాజ్ చట్టాలపై అవగాహన కల్పించేందుకు స్థానిక ఎంపీడీవో కార్యాలయ సమావేశ భవనంలో నిర్వహించిన మూడురోజుల శిక్షణా కార్యక్రమం బుధవారంతో ముగిసింది. ఎంపీడీవో కార్యాలయ ఈవోపీఆర్డీ మోహన్‌కుమార్ మాట్లాడుతూ.. గ్రామస్థాయిలో గ్రామపంచాయతీ అభివృద్ధి ప్రణాళిక సిద్ధం చేసుకుని అందుకు తగ్గట్లుగా గ్రామాలను అభివృద్ధి చేయాలని సూచించారు. కార్యక్రమంలో శిక్షకులుగా బాలునాయక్, శివశంకర్, జగన్‌జీవన్ వ్యవహరించారు.

కొత్తపల్లి: గ్రామాల్లోని వ్యర్థ పదార్థాల నుంచి సంపద సృష్టించి గ్రామాల అభివృద్ధికి పాటుపడుదామని ఎంపీడీవో మేరీ తెలిపారు. బుధవారం గ్రామ పంచాయతీల అభివృద్ధి ప్రణాళికలో భాగంగా మూడో రోజు స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీడీవో మేరీ ఆధ్వర్యంలో కార్యలయ అధికారులకు, సర్పంచులకు, పంచాయతీ కార్యదర్శులకు, క్లాప్ మిత్రులకు మూడో రోజు శిక్షణ కార్యక్రమం జరిగింది.

టీడీపీ నాయకుడి దారుణ హత్య

● వాకిటి శ్రీనివాసులుపై వేట కొడవళ్లతో దాడి ● హోసూరులో ఘటన



వాకిటి శ్రీనివాసులు (ఫైల్)

పత్తికొండ, ఆగస్టు 14: టీడీపీ నాయకుడు వాకిట శ్రీనివాసులు(45) బహిర్భూమికి వెళ్లిన సమయంలో ప్రత్యర్థులు వేటకొడవళ్లతో నరికి హత్య చేశారు. పత్తికొండ మండలం హోసూరు గ్రామంలో మంగళవారం తెల్లవారుజామున ఈ దారుణ సంఘటన జరిగింది. హోసూరు గ్రామ టీడీపీ నాయకుడు వాకిటి శ్రీనివాసులు మంగళవారం తెల్లవారుసజామున 5గంటల ప్రాంతంలో గ్రామ సమీపంలో కల్లందొడ్డిలో బహిర్భూమికి వెళ్లాడు. ఆ సమయంలో గుర్తు తెలియని వ్యక్తులు వేటకొడవలితో దాడి చేయడంతో ఆయన అక్కడికక్కడే మృతి చెందాడు. హత్య ఆనవాళ్లు లేకుండా చేసేందుకు దుండగులు మృతదేహంపైన, చుట్టుపక్కల కారంపొడి చల్లి పారిపోయారు. గ్రామస్థులు పోలీసులకు సమాచారం అందించారు. పత్తికొండ డీఎస్పీ శ్రీనివాసరెడ్డి, పత్తికొండ సీఐ జయన్న, ఎస్ఐ వెంకటేశ్వర్లు సిబ్బందితో సంఘటనా స్థలానికి చేరుకొని విచారణచేపట్టారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పత్తికొండ ఆసుపత్రికి తరలించారు.

కన్నీరు పెట్టుకున్న ఎమ్మెల్యే కేఈ శ్యాంబాబు

టీడీపీ నాయకుడు వాకిటి శ్రీనివాసులు హత్యోదంతం తెలుసుకున్న ఎమ్మెల్యే కేఈ శ్యాంబాబు టీడీపీ నాయకుడు సాంబశివారెడ్డితో కలసి గ్రామానికి చేరుకున్నాడు. శ్రీనివాసులు మృతదేహాన్ని చూసిన ఆయన ఉద్వేగానికి గురై కన్నీరుపెట్టుకున్నారు. నిందితులను తొందరగా పట్టుకోవాలని పోలీసులకు సూచించారు. టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి తుగ్గలి నాగేంద్ర, నాయకులు మనోహర్ చౌదరి, చల్లా రవీంద్రనాథ్ చౌదరి, ప్రమోద్‌కుమార్‌రెడ్డి, బత్తిన వెంకట్రాముడు మృతదేహాన్ని పరిశీలించారు.

సంఘటనా ప్రాంతాన్ని పరిశీలించిన ఎస్పీ

కర్నూలు ఎస్పీ బిందుమాధవ్ సంఘటనా ప్రాంతానికి చేరుకుని హత్యజరిగిన తీరును పరిశీలించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ ఘటనను అన్నికోణాల్లో విచారించి తొందరలో నిందితులను అరెస్టు చేస్తామన్నారు.



సంఘటనా స్థలాన్ని ఎస్పీ బిందుమాధవ్, టీడీపీ నేత తుగ్గలి నాగేంద్ర



కంటతడి పెట్టుకుంటున్న ఎమ్మెల్యే కేఈ శ్యాంబాబు, ఆధారాలు సేకరిస్తున్న క్లూస్‌టీం

క్లూస్‌టీం.. పోలీస్ జాగిలంతో పరిశీలన..

హత్య జరిగిన ప్రాంతంలో కర్నూలు నుండి వచ్చిన క్లూస్‌టీం ఆధారాలను సేకరించింది. మృతదేహం వద్ద వాసన చూసిన పోలీస్ జాగిలం వాకిటి శ్రీనివాసులు మామ ఇంటికి, అక్కడి నుంచి శ్రీనివాసులు ఇంటికి వెళ్లింది. తిరిగి హత్య జరిగిన స్థలానికి వెళ్లి, పొలాల్లోంచి పత్తికొండ-గుంతకల్ ప్రధాన రహదారికి చేరుకుంది.

ఆసుపత్రి వద్దకు చేరుకున్న వందలాది మంది

పోస్టుమార్టం నిమిత్తం పత్తికొండ ప్రభుత్వాసుపత్రికి వాకిటి శ్రీనివాసులు మృతదేహం తరలించారు. అక్కడికి గ్రామస్థులు వందలాదిగా చేరుకున్నారు. సాయంత్రం వైద్యులు పోస్టుమార్టం పూర్తి చేశారు.

గ్రామాధిపత్య పోరు కారణమా..?

వాకిటి శ్రీనివాసులు తన మేనమామ సంజప్ప కూతురు శారదను వివాహం చేసుకున్నాడు. 2013లో సర్పంచ్ ఎన్నికల్లో శారద గెలిచింది. 2024 ఎన్నికల్లో గ్రామంలో టీడీపీకి 400పై చిలుకు మెజార్టీ రావడానికి శ్రీనివాసులు కృషి చేశారు. మండలస్థాయి నామినేటెడ్ పదవి రేసులో ముందంజలో ఉన్నాడు. మండల స్థాయి నాయకుడిగా ఎదుగుతున్న సమయంలో దారుణ హత్యకు గురికావడం చర్చనీయాంశమైంది.

ఆటో బోల్తా.. ఒకరి మృతి

● ఇద్దరికి గాయాలు

తుగ్గలి, ఆగస్టు 14: పత్తికొండ నుంచి గుత్తికి వెళ్తున్న ఆటో బోల్తా పడటంతో సజ్జల గురుస్వామి (65) అక్కడికక్కడే మృతి చెందాడు. మరో ఇద్దరికి స్వల్ప గాయాలయ్యాయి. బుధవారం మండల పరిధిలోని రాతన ఆశ్రమ పాఠశాల వద్ద పత్తికొండ నుంచి గుత్తి వైపు వెళ్తున్న ఆటోకు కుక్కలు అడ్డం వచ్చాయి. ఆటో అదుపు తప్పి బోల్తా పడింది. ఆటోలో ఉన్న హోసూరు చెందిన గురుస్వామి అక్కడికక్కడే మృతి చెందగా.. భార్య శారదమ్మకు, మరొకరికి స్వల్పగాయాలయ్యాయి. తుగ్గలి పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పత్తికొండ వైద్యశాలకు తరలించారు. క్షతగాత్రులను వైద్యశాలకు తరలించి చికిత్సలు అందిస్తున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు. మృతునికి ఐదుగురు కూతుళ్లు ఉన్నారు.

కర్నూలు రేంజ్ పరిధిలో 16 మంది సీఐల బదిలీ

కర్నూలు, ఆగస్టు 14: కర్నూలు అనంతపురం రేంజ్ పరిధిలో 16 మంది సీఐలను బదిలీ చేస్తూ డీఐజీ డా.కోయ ప్రవీణ్ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు

సీఐ పేరు	ప్రస్తుత స్థానం	బదిలీ స్థానం
ఎస్.అస్రార్ బాషా	నంద్యాల త్రీటౌన్ యూపీఎస్	నంద్యాల తాలుకా యూపీఎస్
ఎస్.సూర్య మౌళి	నంద్యాల తాలుకా యూపీఎస్	నంద్యాల త్రీటౌన్ యూపీఎస్
టి.నారాయణ యాదవ్	జమ్మలమడుగు యూపీఎస్, వైఎస్సార్ కడప	ఆర్‌ఎస్‌ఏఎస్‌టీఎఫ్, కడప
ఎస్.లింగప్ప	పులివెందుల రూరల్, వైఎసార్ కడప	జమ్మలమడుగు యూపీఎస్, కడప
వి.కిరణ్ కుమార్ రెడ్డి	వీఆర్, కర్నూలు	పాణ్యం సర్కిల్, నంద్యాల
జి.సుగుణ కుమారి	డీటీసీ, కర్నూలు	వీఆర్‌ఎస్‌పీ, కర్నూలు (సాంక్షన్ పోస్టు)
పి.గౌతమి	కర్నూలు ట్రాఫిక్ పీఎస్	డీటీసీ, కర్నూలు
ఎస్.మన్సూరుద్దీన్	వీఆర్, కర్నూలు	కర్నూలు ట్రాఫిక్ పీఎస్
ఏ.తిక్కస్వామి	వీఆర్, కర్నూలు	కర్నూలు త్రీటౌన్ పీఎస్ (అడిషినల్ పోస్టు)
ఎం.శ్రీనాథరెడ్డి	డీఎస్‌బీ-2, కర్నూలు	పీసీఆర్, ఆదోని, కర్నూలు
పిటీ కేశవరెడ్డి	వీ అండ్‌ఈ కర్నూలు (ఆన్ రిపాట్రిషన్)	డీఎస్‌బీ-2, కర్నూలు
జి.జీవన్ గంగనాథ్ బాబు	ఎల్‌ఆర్ పల్లి సర్కిల్, అన్నమయ్య	పులివెందుల యూపీఎస్, వైఎస్సార్ కడప
సి.శంకర్ రెడ్డి	పులివెందుల యూపీఎస్, వైఎస్సార్ కడప	వీఆర్, కడప
ఎన్.వెంకటరమణ	పులివెందుల యూపీఎస్ వైఎస్సార్ కడప	పులివెందుల రూరల్, వైఎస్సార్ కడప
జి.వెంకటేశ్వర్లు	రాజంపేట యుపీఎస్, అన్నమయ్య	కడప తాలుకా యూపీఎస్, వైఎస్సార్ కడప
ఎన్.వెంకట నాగరాజు	కడప తాలుకా యూపీఎస్, వైఎస్సార్ కడప	రాజంజేట యూపీఎస్, అన్నమయ్య

కేజీబీవీ పాఠశాల తనిఖీ



విద్యార్థులతో మాట్లాడుతున్న లోక్ అదాలత్ జడ్జి లీలా వెంకటశేషాద్రి

ఓర్వకల్లు, ఆగస్టు 14: ఓర్వకల్లులో ఉన్న కస్తూర్బా గాంధీ పాఠశాలను బుధవారం లోక్ అదాలత్ జడ్జి లీలా వెంకటశేషాద్రి తనిఖీ చేశారు. వంట గది, సరుకులు, కంప్యూటర్ గది, కూరగాయల గదులను పరిశీలించారు. అనంతరం విద్యార్థులతో మాట్లాడి భోజన వసతుల గురించి ఆరా తీశారు. విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని, క్రీడల్లో రాణించేలా కృషి చేయాలని సూచించారు. విద్యార్థులకు పాఠశాలలో మౌలిక సదుపాయాలు కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్‌వో హరిత, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఆస్తి కోసం తల్లిదండ్రులపై దాడి

సి.బెళగల్, అగస్టు 14: మండలంలోని కొత్తకోట గ్రామానికి చెందిన కరణం మల్లికార్జున, భార్య సుజాత, కూతురు ఇంద్రాణిలపై ఆస్తి కోసం కొడుకులు విజయ్, నాగార్జున, కోడళ్లు హేమలత, ప్రభావతి దాడి చేశారు. ఈ ఘటన బుధవారం జరిగింది. ఆస్తి పంపకాల్లో తేడా వచ్చిందని ఆగ్రహించి కొడుకులు, కోడళ్లు ఈ దాడికి పాల్పడ్డారని కరణం మల్లికార్జున ఫిర్యాదు చేశారు. ఈ మేరకు గ్రామంలో విచారణ చేసి నలుగురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తిమ్మారెడ్డి తెలిపారు.

కాలనీవాసులపై దొంగల దాడి

● దేహశుద్ధి చేసిన గ్రామస్థులు

మంత్రాలయం, ఆగస్టు 14: మంత్రాలయం మండలం తుంగభద్ర రైల్వేస్టేషన్ తారనాథ్ ఆశ్రమ సమీపంలో మంగళవారం అర్ధరాత్రి దాటాక దొంగలు హల్‌చల్ చేశారు. కాలనీలోకి ఇద్దరు గుర్తు తెలియని వ్యక్తులు రాడ్లతో రావడం గమనించిన ఆనందమ్మ, ఆమె కుమారుడు రవి వారిని ప్రశ్నించారు. దీంతో వారు ఆ తల్లీ కొడుకుల తలపై రాడ్లతో దాడి చేశారు. అంతలో పక్కింటి వారు వచ్చి ఆగంతకుల్లో ఒకరిని ఒకరిని పట్టుకుని చితకబాదారు. ఒక దొంగ పరారయ్యాడు. గ్రామాల్లో బీహార్, చత్తీస్‌ఘడ్ ప్రాంతాల నుంచి వచ్చిన దొంగలు సంచరిస్తున్నట్లు ప్రజలు అంటున్నారు. ఈ విషయంపై మాధవరం ఎస్ఐ కృష్ణమూర్తిని వివరణ కోరగా.. తమ దృష్టికి రాలేదన్నారు.

భళా.. బసవన్నలు

● ఏడు గంటల్లో పదెకరాల్లో గుంటక

కోసిగి, ఆగస్టు 14: మండలంలోని జంపాపురం గ్రామానికి చెందిన తుమ్మలబీడు లింగారెడ్డి అనే రైతుకు చెందిన ఎద్దులు ఏడు గంటల్లో పదెకరాల పత్తి పంటలో గుంటక పట్టి భళా అనిపించుకున్నాయి. బుధవారం రైతు లింగారెడ్డి తన పదెకరాల పత్తి పొలంలో ఉదయం 5గంటల నుంచి 12 గంటల వరకు గుంటక పట్టాడు. మూడు రోజులు చేసే పనులను ఒకే రోజు ఏడు గంటల్లో అయన ఎద్దులు పూర్తి చేశాయి. ఈ సందర్భంగా ఎద్దులను పొలం నుంచి డప్పు వాయిద్యాలతో గ్రామంలోని బసవేశ్వర స్వామి ఆలయం దగ్గరికి ఊరేగింపుగా తీసుకొచ్చి పూజలు చేశారు.



గుంటికపాసిన ఎద్దులతో యజమానులు

డోన్ డీఎస్పీగా శ్రీనివాసులు


ఎమ్మెల్యే కోట్లకు బొకే ఇస్తున్న డీఎస్పీ శ్రీనివాసులు

డోన్, ఆగస్టు 14: డోన్ డీఎస్పీగా పి. శ్రీనివాసులు బుధవారం బాధ్యతలు స్వీకరించారు. సీఐడీవిభాగంలో పని చేస్తున్న శ్రీనివాసు లును డోన్ డీఎస్పీగా నియమిస్తూ గత నెల 31వ తేదీన రాష్ట్ర డీజీపీ ఉత్తర్వులు జారీ చేశారు. లిక్కర్ స్కామ్ కేసును రాష్ట్ర ప్రభుత్వం సీఐ డీకి అప్పగించడంతో ఆ కేసు విచారణలో శ్రీనివాసులు కూడా ఉన్నారు. విచారణ పూర్తి కావడంతో పట్టణంలోని డీఎస్పీ కార్యాలయంలో శ్రీనివాసులు డీఎస్పీగా బాధ్యతలు స్వీకరించారు. అనంతరం డోన్ పట్టణంలోని ఎమ్మెల్యే ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాశ్‌రెడ్డి నివాసంలో ఆయన్ను డీఎస్పీ శ్రీనివాసులు మర్యాదపూర్వకంగా కలిసి పూలబొకే అందజేశారు. అసాంఘిక కార్యకలాపాలపై దృష్టి సారించాలని డీఎస్పీకి కోట్ల సూచించారు. నూతన డీఎస్పీ శ్రీనివాసులును పట్టణ, రూరల్, ప్యాపిలి, బేతంచెర్ల సీఐలు ఇంతియాజ్‌బాషా, సీఎం రాకేష్, వెంకట్రామిరెడ్డి, వెంకటేశ్వరరావులు మర్యాపూర్వకంగా కలిసి అభినందనలు తెలిపారు.

డోన్(రూరల్): డోన్ డీఎస్పీ శ్రీనివాసులును అర్చకులు మర్యాదపూర్వకంగా కలిశారు. పట్టణంలోని సాంబ శివాలయం అర్చకులు, పురోహితులు షేశావలి శర్మ డీఎస్పీని కలిసి ఆశీర్వచనాలు ఇచ్చారు.

వైభవంగా బసవేశ్వర స్వామి విగ్రహ ప్రతిష్ఠ

ఉయ్యాలవాడ, ఆగస్టు 14: మండల కేంద్రంలోని బస్టాండ్ సమీపంలో బసవేశ్వర స్వామి విగ్రహ ప్రతిష్ఠను బుధవారం వైభవంగా నిర్వహించారు. స్వామి విగ్రహాన్ని వేదపండితులు, వేదమంత్రాలతో స్వామివారిని ప్రతిష్ఠించారు. అర్చకులు జగన్‌మోహన్‌శర్మ, రాజుశర్మ, మోహనయ్య, భాష్కర్‌శర్మ, కమలేశ్వరశర్మలు స్వామి వారికి ప్రాత:కాల పూజ, యంత్రస్థాపన చేసి ఉదయం 9 గంటలకు స్వామి వారికి ప్రాణ ప్రతిష్ఠ చేశారు. అనంతరం స్వామి వారికి కుష్మాండబలి, పూర్ణాహుతి, కలశ ఉద్వాసన చేశారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామి వారిని దర్శించుకున్నారు. భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు.

కలగా మిగిలిన ప్రభుత్వ మహిళా కళాశాల

» అటకెక్కిన ప్రతిపాదనలు » పట్టించుకోని పాలకులు


డోన్ ప్రభుత్వ జూనియర్ కళాశాల

డోన్(రూరల్), ఆగస్టు 14: గత నాలుగు సంవత్సరాలుగా డోన్‌లో మహిళా ప్రభుత్వ జూనియర్ కళాశాల ఏర్పాటు చేయాలన్న డిమాండ్ కలగా మిగిలిపోయింది. ప్రస్తుత డోన్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో బాలికల సంఖ్య అంతంత మాత్రంగానే ఉంది. ప్రస్తుత విద్యాసంవత్సరంలో డోన్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మొత్తం 280 మందికి పైగా విద్యార్థులు ఉండాలి. కానీ కేవలం 50 మంది మాత్రమే ఉన్నారు. ఆర్థిక పరిస్థితులు బాగున్న తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రైవేటు జూనియర్ కళాశాలల్లో చేర్పించేందుకు ఆసక్తి చూపుతున్నారు. పేద కుటుంబాలకు సంబంధించిన విద్యార్థులు 10వ తరగతి అనంతరం మహిళా కళాశాలలు లేకపోవడంతో చదువుకు దూరమవుతున్నారు. 2021-22 విద్యాసంవత్సరంలో డోన్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 8 మందికి మించి బాలికలు లేరని కళాశాల లెక్చరర్లు అంటున్నారు. 2022-23 విద్యాసంవత్సరానికి ఈ సంఖ్య 25కు చేరుకుందని, ప్రస్తుత విద్యాసంవత్సరం 50 మందికి పైగా విద్యార్థినులు కళాశాలలో చదువుకుంటున్నారని ప్రభుత్వ జూనియర్ కళాశాల ఉపాధ్యాయ వర్గాలు తెలుపుతున్నాయి.

చదువులకు దూరమవుతున్నారు



డోన్‌లో మహిళా ప్రభుత్వ జూనియర్ కళాశాల లేకపోవడంతో పేద విద్యార్థినులు చదువుకు దూరం అవుతున్నారు. ఆర్థిక పరిస్థితులు సహకరించక తల్లిదండ్రులు పదో తరగతి తర్వాత చదువు మానిపిస్తున్నారు. కాబట్టి కాలేజీ ఏర్పాటు చేయాలి.

- నక్కి హరి, డీవైఎఫ్ఐ మండల కార్యదర్శి

మహిళా జూనియర్ కళాశాలను ఏర్పాటు చేయాలి



పట్టణం, గ్రామీణ విద్యార్థినులను దృష్టిలో ఉంచుకుని డోన్‌లో మహిళా జూనియర్ కళాశాలను ఏర్పాటు చేస్తే ప్రయోజనంగా ఉంటుంది. పదో తరగతి అనంతరం బాలికలు చదువుకోవడానికి ఆసక్తి కనబరుస్తారు. ఆ దిశగా ప్రభుత్వం ఆలోచన చేయాలి.

- రాజా విజయ్‌కుమార్, రోటరీ క్లబ్ వ్యవస్థాపక సభ్యుడు

దెబ్బతిన్న మొక్కజొన్న పంటల పరిశీలన


మొక్కజొన్న పంటను పరిశీలిస్తున్న ఆర్ఏఆర్ఎస్ శాస్త్రవేత్తలు

చాగలమర్రి, ఆగస్టు 14: మండలంలోని బ్రాహ్మణపల్లె గ్రామంలో దెబ్బతిన్న మొక్కజొన్న పంటలను ఆర్ఏఆర్ఎస్ శాస్త్రవేత్తలు బాలాజీనాయక్, వెంకటరమణమ్మ, సతీష్‌కుమార్, ఇర్షపర్వీన్ బుధవారం పరిశీలించారు. రైతులకు సూచనలు, సలహాలు ఇచ్చారు. శ్రీనివాసరెడ్డి సాగు చేసిన 4 ఎకరాల మొక్కజొన్న పంటను పరిశీలించారు. శాస్త్రవేత్తలు మాట్లాడుతూ నీటిలో ఉప్పు శాతం అధికంగా ఉండటం వల్ల మొక్కజొన్న పంట దెబ్బతిందని అన్నారు. నీటిలో 32 శాతం ఉప్పు ఉందని, 2 శాతం మాత్రమే ఉండాలని చెప్పారు. రైతులకు సంబంధించిన 12 బోర్ల ద్వారా ఫ్లోరైడ్ నీరు ఉండటం వల్ల పంటలు దెబ్బతింటున్నాయని, రైతులు మొక్కజొన్న పంట కాకుండా ప్రత్యామ్నాయ పంటలు సాగు చేసుకోవాలని సూచించారు. రైతుల బోర్ల నీటిని కృషి విజ్ఞాన కేంద్రానికి శాంపిళ్లు తీసి పంపించగా పరీక్షించారని, వల్ల ఉప్పు శాతం అధికంగా ఉన్నట్లు నివేదికలు వచ్చాయని తెలిపారు. భూసారం కూడా తగ్గిపోతోందని అన్నారు. పత్తి, పసుపు తదితర పంటలు సాగు చేసుకోవాలని సూచించారు. వారి వెంట ఏవో రంగనేతాజీ, ఏఈవో అస్రఫ్, ఆర్ఎస్‌కే ఇన్‌చార్జి రాధాకృష్ణ, రైతులు పాల్గొన్నారు.

ఉప కాలువకు గండి


19వ బ్లాక్ చానల్ ఉపకాలువకు పడిన గండి

రుద్రవరం, ఆగస్టు 14: మండలంలోని అప్పనపల్లె పైభాగంలో ఉన్న 19వ బ్లాక్ చానల్ ఉప కాలువకు గండి పడినట్లు రైతులు బుధవారం తెలిపారు. సాగునీరంతా వృథా అవుతుందని వాపోయారు. తెలుగుగంగ అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడంలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కాలువ కింద తెలుగుగంగ ఆయకట్టు భూములు నీళ్లు లేక ఇబ్బంది పడుతున్నామన్నారు. సాగునీరు లేక పంటలకు పారించలేకపోతున్నామన్నారు. గంగ అధికారులు గండి పూడ్చాలని రైతులు కోరుతున్నారు.

పేదలకు వరం అన్న క్యాంటీన్లు: బీసీ రాజారెడ్డి


మాట్లాడుతున్న బీసీ రాజారెడ్డి

కొలిమిగుండ్ల, ఆగస్టు 14: పేదలకు వరం అన్న క్యాంటీన్లు అని మంత్రి బీసీ సోదరుడు, బనగానపల్లె పట్టణ మాజీ సర్పంచ్ బీసీ రాజారెడ్డి అన్నారు. బుధవారం బనగానపల్లె పట్టణంలో జరిగిన ఓ కార్యక్రమంలో బీసీ రాజారెడ్డితోపాటు, మంత్రి సతీమణి బీసీ ఇందిరమ్మ, టీడీపీ సీనియర్ నాయకుడు ఐవీ పక్కీరారెడ్డి, రాయలసీమ కలాం, టంగుటూరు శీనయ్య, యాగంటిరెడ్డి, వైసీపీ నాయకుడు గుండం శేషిరెడ్డి పాల్గొన్నారు.

యాగంటి ఆలయ అభివృద్ధికి కృషి

బనగానపల్లె, ఆగస్టు 14: మండలంలోని యాగంటి ఉమామహేశ్వర దేవస్థానం అభివృద్ధికి కృషి చేస్తామని మంత్రి సోదరుడు బీసీ రాజారెడ్డి అన్నారు. బుధవారం యాగంటి ఆలయ ఈవో చంద్రశేఖరరెడ్డి, ప్రధాన అర్చకులు మహేష్‌శర్మ, చిన్ను, ప్రసాద్, యాగంటి ఉపసర్పంచ్ మౌళీశ్వరరెడ్డి తదితరులు బీసీ రాజారెడ్డిని కలిశారు. ఈ సందర్భంగా బీసీ రాజారెడ్డిని సన్మానించారు. అనంతరం ఆలయ అభివృద్ధిపై వారు చర్చించారు.

రంగాపురంలో పంట నమోదు

బేతంచెర్ల, ఆగస్టు 14: మండలంలోని ఆర్ఎస్ రంగాపురం గ్రామం లో పంట నమోదు కార్యక్రమం నిర్వహించారు. బుధవారం అగ్రికల్చర్ అసిస్టెంట్ యశోధ, ఎంపీఈవో వైష్ణవి రైతుల పొలాలకు వెళ్లి వారు చేసిన పంటలను నమోదు చేశారు. రైతులు తాము వేసిన పంట వివరాలను వెంటనే పంట వివరాలను రైతు సేవా కేంద్రంలోని అగ్రికల్చర్ అసిస్టెంట్లకు తెలియజేసి పంట నమోదు చేయించుకోవాలని రైతులకు సూచించారు.

పంట నమోదు వేగవంతం చేయాలి: ఏవో

కొలిమిగుండ్ల, ఆగస్టు 14: మండలంలోని వివిధ గ్రామాల్లో పంట నమోదు కార్యక్రమం వేగవంతం చేయాలని మండల వ్యవసాయాధికారి భూమా జ్యోతి సిబ్బందిని ఆదేశించారు. బుధవారం ఆమె మాట్లాడుతూ ఖరీఫ్‌లో పంటలు సాగుచేసిన ప్రతి రైతు రైతుసేవా కేంద్రాల్లో సంప్రదించి పంట నమోదు చేసుకోవాలని సూచించారు. గ్రామ వ్యవసాయ సహాయకులు మనోహర్, సుబ్రహ్మణ్యం, సందీప్, స్నేహ, చంద్ర శేఖర్ పాల్గొన్నారు.

విద్యుత్ కేంద్రం తనిఖీ

చాగలమర్రి, ఆగస్టు 14: చాగలమర్రి గ్రామంలోని విద్యుత్ కేంద్రాన్ని విద్యుత్‌శాఖ డీఈ శ్రీనివాసరెడ్డి బుధవారం తనిఖీ చేశారు. విద్యుత్ సబ్‌స్టేషన్‌లో గల పవర్ ట్రాన్స్‌ఫార్మర్లు, బ్రేకర్లు, విద్యుత్ వినియోగ మీటర్లను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ విద్యుత్ సిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉండి విద్యుత్ సమస్యలను పరిష్కరించాలని సూచించారు. విద్యుత్ ప్రమాదాలతో సిబ్బంది అప్రమత్తంగా ఉండాలన్నారు. విద్యుత్ ప్రమాదాల పట్ల రైతులకు గ్రామాల్లో అవగాహన కల్పించాలని అన్నారు. రైతులకు తొమ్మిది గంటలు విద్యుత్ ఇస్తున్నామని అన్నారు. కార్యక్రమంలో విద్యుత్ ఏఈ షాజహాన్, లైన్ ఇన్‌స్పెక్టర్ ప్రసాదు, సిబ్బంది ఉన్నారు.

'ప్రజలతో మర్యాదపూర్వకంగా నడుచుకోవాలి'

ప్యాపిలి, ఆగస్టు 14: ప్రజలతో మర్యాదపూర్వకంగా నడుచుకోవాలని సీఐ వెంకటరామిరెడ్డి పోలీసు సిబ్బందికి సూచించారు. బుధవారం ఆయన తన కార్యాలయంలో మాట్లాడుతూ మండలంలోని ప్యాపిలి, జలదుర్గం, రాచెర్ల పోలీసుల స్టేషన్లలో వివిధ సమస్యలు చెప్పడానికి బాధితులు వస్తుంటారని, వారితో స్నేహపూర్వకంగా మాట్లాడాలన్నారు. పోలీసులు తమపై నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే నేరుగా తనకు ఫిర్యాదు చేయాలని సూచించారు.

మోటార్ సైకిల్‌ను ఢీకొన్న ఆర్టీసీ బస్సు

కొలిమిగుండ్ల, ఆగస్టు 14: మండలంలోని మదనంతపురం గ్రామం సమీపంలో మోటార్‌సైకిల్‌ను ఆర్టీసీ బస్సు ఢీకొన్న ఘటనలో కోరుమానుపల్లె గ్రామానికి చెందిన ప్రదీప్‌కుమార్‌రెడ్డి తీవ్రంగా గాయపడినట్లు హెడ్‌కానిస్టేబుల్ నరసింహులు తెలిపారు. కోరుమానుపల్లెకు చెందిన ప్రదీప్‌కుమార్‌రెడ్డి బైక్‌పై అంకిరెడ్డిపల్లె వైపు వెళుతుండగా తాడిపత్రి నుంచి కోవెలకుంట్ల వైపు వెళుతున్న కోవెలకుంట్ల ఆర్టీసీ బస్సు ఢీకొనడంతో తీవ్ర గాయాలయ్యాయి. దీంతో అతన్ని ఆసుపత్రికి తరలించి, కేసునమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

ఆంజనేయస్వామి ఆలయ జీర్ణోద్ధరణ

చాగలమర్రి, ఆగస్టు 14: చాగలమర్రి గ్రామంలోని పాత బస్టాండు సమీపంలో రాజుల కాలం నిర్మించిన ఆంజనేయస్వామి ఆలయం దెబ్బతినడంతో ఆలయ కమిటీ అధ్యక్షుడు వేణుగోపాల్‌రెడ్డి కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో జీర్ణోద్ధరణ పనులు చేపట్టారు. బుధవారం ఆలయ జీర్ణోద్ధరణ పనులు చేయడానికి వేద పండితుడు పెద్దశాస్త్రి ఆధ్వర్యంలో ఆంజనేయస్వామికి జల, క్షీరాభిషేకాలు, పూర్ణాహుతి కార్యక్రమాలను నిర్వహించారు. రూ.10 లక్షలతో జీర్ణోద్ధరణ పనులు చేస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో టీఎస్‌టీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుత్తి నరసింహులు, హిందూ సంఘం సభ్యులు భాస్కర్‌రెడ్డి, రోహితీశ్వర్‌రెడ్డి, హేమ, సురేష్, భాస్కర్, రమణ, రాముడు తదితరులు పాల్గొన్నారు.

సచివాలయాల్లో రిజిస్ట్రేషన్ల రద్దుపై హర్షం

డోన్(రూరల్), ఆగస్టు 14: గత వైసీపీ ప్రభుత్వం సచివాలయాల్లో ఏర్పాటు చేసిన భూ రిజిస్ట్రేషన్ విధానాన్ని టీడీపీ కూటమి ప్రభుత్వం రద్దు చేయడంపై డోన్ జనసేన నియోజకవర్గ నాయకులు ఆలా మోహన్ రెడ్డి హర్షం వ్యక్తం చేశారు. బుధవారం సాయంత్రం డాక్యుమెంటు రైటర్లతో కలిసి ఏర్పాటు చేసిన సమావేశంలో ఆలా మోహన్ రెడ్డి మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వంలో సచివాలయాల్లోని పట్టణ ప్రాంతాల్లో రూ.15వేలు, గ్రామీణ ప్రాంతాల్లో రూ.10వేలు చెల్లిస్తే శాశ్వత భూహక్కు పత్రం ఇస్తారని అన్నారు. వైసీపీ ప్రభుత్వం లబ్ధిదారుల నుంచి వసూలు చేసిందన్నారు. అయితే సచివాలయాలు రిజిస్ట్రేషన్ చేసుకున్న పత్రాలు బ్యాంకుల్లో తాకట్టు పెట్టేందుకు వెళితే.. బ్యాంకులు తిరస్కరించాయన్నారు. జనసైనికులు, డాక్యుమెంటు రైటర్లు పాల్గొన్నారు.

సీఐని కలిసిన టీడీపీ నాయకులు

కొలిమిగుండ్ల, ఆగస్టు 14: మండలంలోని కల్వటాల గ్రామానికి చెందిన టీడీపీ నాయకులు కామిని క్రిష్ణరంగారెడ్డి, కామిని భాస్కరరెడ్డిలు నూతన సీఐ రమేష్‌బాబును బుధవారం మర్యాదపూర్వకంగా కలిసి అభినందనలు తెలిపారు. సీఐ మాట్లాడుతూ గ్రామాల్లో అసాంఘిక చర్యలకు పాల్పడితే తమ దృష్టికి తీసుకరావాలని వారికి సూచించారు.

కోట్లను కలిసిన సర్పంచ్

బేతంచెర్ల, ఆగస్టు 14: మండలంలోని అంబాపురం సర్పంచ్ శ్రీనివాస్ యాదవ్, గ్రామ టీడీపీ నాయకులు జగదీశ్వర్ రెడ్డి మర్యాదపూర్వకంగా డోన్‌లోని ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాష్‌రెడ్డి నివాసంలో బుధవారం ఆయన్ను కలిశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వం అమలు చేస్తున్న సూపర్ సిక్స్ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు.

వసుధ ఫౌండేషన్ సేవలు మరువలేనివి

కోవెలకుంట్ల, ఆగస్టు 14: వసుధ ఫౌండేషన్ ద్వారా పేదలకు అందిస్తున్న సేవలు మరువలేనివని టీడీపీ నాయకుడు, ప్రముఖ న్యాయవాది గాలే సాహెబ్‌గారి అలీహుసేన్ తెలిపారు. బుధవారం పట్టణంలోని ఎఎన్‌కే పాఠశాలలో చౌదరిదిన్నె గ్రామానికి చెందిన మాసుగారి చిన్నమాసుం వైద్యం చేయించుకోడానికి ఫౌండేషన్ ద్వారా రూ.10 వేలు చెక్కును ఇప్పించారన్నారు.

బస్సులు కండీషన్‌లో ఉండాలి: ఆర్టీవో

ఆళ్లగడ్డ, ఆగస్టు 14: పాఠశాలల బస్సులు కండిషన్‌లో ఉండాలని ఆర్టీవో రవిశంకర్ నాయక్ ఆదేశించారు. ఆళ్లగడ్డ పట్టణంలోని పాఠశాలల బస్సులను బుధవారం తనిఖీ చేశారు. ఆర్టీవో మాట్లాడుతూ పాఠశాలల బస్సులు కండిషన్‌లో లేవని, వీటిని వెంటనే మార్చుకోవాలని సూచించారు. బస్సుల డ్రైవర్లు విధిగా లైసెన్స్ కలిగి ఉండాలన్నారు.

78 నెంబర్ ఆకృతిలో విద్యార్థుల ప్రదర్శన


పడకండ్ల హెచ్‌పీఎం పాఠశాలలో 78 నెంబర్ ఆకృతిలో విద్యార్థులు

ఆళ్లగడ్డ, ఆగస్టు 14: భారతదేశ 78వ స్వాతంత్ర్య వేడుకలను పురస్కరించుకొని ఆళ్లగడ్డ మున్సిపాలిటీ పరిధిలోని పడకండ్ల హెచ్‌పీఎం పాఠశాలలో ఆ సంఖ్యలో విద్యార్థులు బుధవారం కూర్చొని ముందుస్తు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమాన్ని నంద్యాల జిల్లా ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాల అధ్యక్షుడు అమీర్‌బాషా ఆధ్వర్యంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సురేష్‌బాబు నిర్వహించారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సారా విక్రేతల అరెస్టు

బనగానపల్లె, ఆగస్టు 14: పట్టణంలోని తెలుగుపేటలో నాటుసారా విక్రయాలపై దాడులు నిర్వహించి, ఇద్దరు నాటుసారా విక్రేతలను అరెస్ట్ చేసినట్లు సెబ్ సీఐ జోగేంద్ర, డిటిఎఫ్ సీఐ విజయ్‌కుమార్ బుధవారం తెలిపారు. తెలుగుపేటకు చెందిన చిన్నమద్దిలేటి వద్ద నుంచి 20 లీటర్లు నాటుసారా, బాలపుల్లయ్య నుంచి 20లీటర్లు నాటు సారాను స్వాధీనం చేసుకొని అరెస్ట్ చేసినట్లు వారు తెలిపారు.

కొలిమిగుండ్ల: మండలంలోని గొర్విమానుపల్లె గ్రామ సమీపంలో నొస్సం రవి అనే నాటుసారా విక్రేతను అరెస్ట్ చేసి, అతని వద్ద నుంచి 25 లీటర్లు నాటుసారా స్వాధీనం చేసుకున్నట్లు ఏఎస్ఐ గోవిందనాయక్ తెలిపారు. బుధవారం గొర్విమానుపల్లె వద్ద తనిఖీలు నిర్వహిస్తుండగా పట్టుబడినట్లు ఆయన తెలిపారు.

బేతంచెర్ల: పట్టణంలోని హనుమాన్‌నగర్ కాలనీ సమీపంలో ఉన్న ఆదర్శ విద్యామందిర్ పాఠశాల సమీపంలో నాటుసారా విక్రేతను అరెస్టు చేసి అతని వద్ద నుంచి 15 లీటర్ల నాటుసారా స్వాధీనం చేసుకున్నట్లు హెడ్ కానిస్టేబుల్ సజ్జాద్ వలి బుధవారం తెలిపారు. హనుమాన్‌నగర్‌కు చెందిన బోయ రామకృష్ణ అనే వ్యక్తి నాటుసారా విక్రయిస్తుండగా.. అతన్ని అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేసినట్లు తెలిపారు. నిందితుడ్ని డోన్ కోర్టులో హాజరు పరచగా మెజిస్ట్రేట్ రిమాండ్‌కు ఆదేశించారని ఆయన తెలిపారు.

మద్యం సీసాల స్వాధీనం

ఆళ్లగడ్డ, ఆగస్టు 14: ఆళ్లగడ్డ నుంచి అక్రమంగా క్రిష్టాపురం గ్రామానికి 98 మద్యం సీసాలను తీసుకెళ్లుతున్న సందీప్‌కుమార్ అనే వ్యక్తిని పట్టణంలోని సీఎస్ఐ చర్చి వద్ద అరెస్టు చేసినట్లు పట్టణ ఎస్ఐ నగీనా బుధవారం తెలిపారు. సందీప్ కుమార్ నుంచి మద్యం సీసాలను స్వాధీనం చేసుకొని అతడిపై కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఆమె చెప్పారు.

కొలిమిగుండ్ల: మండలంలోని పేట్నికోట గ్రామంలోని చిరు దుకాణంలో అక్రమంగా మద్యం సీసాలు విక్రయిస్తుండగా దాడిచేసి, మధుసూదన్‌రెడ్డి అనే వ్యక్తిని అరెస్టు చేసినట్లు హెడ్‌కానిస్టేబుల్ నరసింహులు తెలిపారు. అతని వద్ద నుంచి 25 మద్యం సీసాలు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

ప్రైవేటు వ్యాయామ ఉపాధ్యాయుడిపై కేసు

ఆళ్లగడ్డ, ఆగస్టు 14: ఆళ్లగడ్డ పట్టణంలోని ఓ ప్రైవేటు పాఠశాలలో వ్యాయామ ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న పీటర్‌పై కేసు నమోదు చేసినట్లు పట్టణ ఎస్ఐ నగీనా బుధవారం చెప్పారు. వ్యాయామ ఉపాధ్యాయుడు పీటర్ తన పట్ల అసభ్యంగా ప్రవర్తించారని ఓ విద్యార్థిని తల్లి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు.

గ్రామాభివృద్ధికి కృషి చేయాలి

» జిల్లా రిసోర్స్‌పర్సన్ దస్తగిరి బాషా
» ముగిసిన శిక్షణ తరగతులు

చాగలమర్రి, ఆగస్టు 14: మండలంలోని ఆయా గ్రామ సర్పంచ్‌లు గ్రామాభివృద్ధికి కృషి చేయాలని జిల్లా రిసోర్స్‌పర్సన్ దస్తగిరి బాషా సూచించారు. బుధవారం ఎంపీడీవో కార్యాలయంలో సర్పంచ్‌లు, కార్యదర్శుల ముగింపు శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. దస్తగిరిబాషా మాట్లాడుతూ గ్రామాల్లో ప్రణాళికాబద్ధంగా పనులు చేపట్టాలని, పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి ఉంచాలని సూచించారు. డంపింగ్ యార్డ్‌లను కొనసాగించాలని, సంపద వనరులను సృష్టించుకోవాలని అన్నారు. ఎంపీడీవో మహబూబ్‌దౌలా, ఈవోఆర్డీ తాహిర్ హుసేన్, ఏవో రాజేంద్రప్రసాద్ పాల్గొన్నారు.

ఉయ్యాలవాడ: గత మూడు రోజులుగా జరుగుతున్న సర్పంచ్‌ల శిక్షణా తరగతులు బుధవారంతో ముగిశాయి. ఈ ముగింపు శిక్షణకు నంద్యాల డీఎల్‌పీవో రాంబాబు హాజరై మాట్లాడారు. శిక్షణ ముగిసిన వెంటనే గ్రామ సర్పంచ్‌లు తమ గ్రామాలను అభివృద్ధి పదంలో నడపాలన్నారు. ఎంపీడీవో ఉమమహేశ్వరరావు, ఈవోపీఆర్డీ మహీధర్‌రెడ్డి, శానిటేషన్ మండల కో-ఆర్డినేటర్ రమణారెడ్డి పాల్గొన్నారు.

దొర్నిపాడు: మండలంలోని ఆయా గ్రామాల్లోని సమస్యలను పరిష్కరించేందుకు సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు కృషి చేయాలని డీఎల్పీవో రాంబాబు అన్నారు. బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో శ్రీనివాస్ ఆధ్వర్యంలో సర్పంచ్‌లు, కార్యదర్శులకు శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. వారు మాట్లాడుతూ గ్రామాల్లో నెలకొన్న మంచి నీటి సమస్య, డ్రైనేజీ, వీధి దీపాలు, సీసీ రోడ్ల నిర్మాణాలు తదితర సమస్యలను గుర్తించి వెంటనే పరిష్కరించాలని సూచించారు.

కోవెలకుంట్ల: పట్టణంలోని ఎంపీడీవో కార్యాలయంలో ఈ నెల 12వ తేదీ నుంచి ప్రారంభమైన సర్పంచ్‌ల శిక్షణ కార్యక్రమం బుధవారం సాయంత్రంతో ముగిసిందని ఎంపీడీవో సయ్యదున్నీసా, ఈవోపీఆర్డీ రాధికారెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామ పంచాయతీల అభివృద్ధిలో భాగంగా విధులు, బాధ్యతలపై సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులకు శిక్షణ మూడురోజుల పాటు నిర్వహించామన్నారు.

రుద్రవరం: రుద్రవరం మండల పరిధిలోని 21 గ్రామపంచాయతీల సర్పంచ్‌లు, కార్యదర్శులకు నిర్వహించిన శిక్షణ తరగతులు బుధవారంతో ముగిశాయని ఎంపీడీఓ మధుసూదన్‌రెడ్డి తెలిపారు. పంచాయతీ పరిధిలోని ఎస్‌డబ్ల్యూటీసీ నిర్వహణ వాటికి సంబంధించిన సూచనలు, సలహాలు ఇచ్చారు. అలాగే గ్రామాల్లో ఉన్న ఎల్ఈ ఈ బల్బుల నిర్వహణ, వాటి వల్ల కలిగే ప్రయోజనాలు వివరించారు. వీటిని సభ్యులకు వివరించి గ్రామాభివృద్ధికి పాటుపడాలన్నారు. కార్యక్రమంలో ఈవోపీఆర్‌డి శ్రీనివాసశర్మ, శిక్షకులు షాహినూర్, పాములేటి, కార్యదర్శులు, పంచాయతీ సర్పంచ్‌లు పాల్గొన్నారు.


చాగలమర్రిలో మాట్లాడుతున్న జిల్లా రిసోర్స్‌పర్సన్


దొర్నిపాడులో మాట్లాడుతున్న డీఎల్పీవో రాంబాబు


ఉయ్యాలవాడలో డీఎల్పీవోతో సర్పంచ్‌లు, కార్యదర్శులు